# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 06-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్లుండి ఢిల్లీలో నిర్వహించే వేడుకలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అధ్యక్షతన జరగనున్నాయి.**

**2.** **మాజీ మంత్రి దగ్గుబాటి వేంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.**

**3.** **ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ఇప్పటివరకు 33 లక్షల 67 వేల 791 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**4.** **రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రతిపాదనలు వేగంగా కార్యరూపం దాల్చేలా చూసేందుకు వీలుగా రాష్ట్ర ప్రాజెక్ట్ మోనిటరింగ్ గ్రూప్ ఏర్పాటైంది.**

**5.** **ఏలూరు జిల్లా చోదిమెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 20 మందికి గాయాలయ్యాయి.**

==========================

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నాయకత్వం వహించనున్నారు. కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో "మహిళా శక్తితో వికసిత్ భారత్" అనే అంశంపై ఈ నెల 8వ తేదీన జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా ఉన్నత స్థాయి చర్చ నిర్వహిస్తారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం, బిజినెస్, స్పోర్ట్స్, మీడియా, పరిపాలన రంగాల నుంచి ప్రఖ్యాత మహిళా నాయకులతో మూడు సదస్సులు నిర్వహిస్తారు. ప్రగతిశీల భారతదేశాన్ని రూపొందించడంలో మహిళల సహకారాన్ని తెలియజేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

-------------------------

రాష్ట్రంలో విజయం సాధించిన శాసనమండలి సభ్యులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్‌ను మోదీ రీపోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తూనే ఉంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీకి రాష్ట్రంలోని ఎన్డీయే పక్షాల తరఫున చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. మోదీ నేతృత్వంలో

దేశంలో, రాష్ట్రంలో మరిన్ని విజయాలు దక్కుతాయని.. ఎన్డీయే పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి ఆశించారు.

---------------------------

ప్రపంచ చరిత్రపై పుస్తకం రాసేందుకు చాలా విషయాలు తెలుసుకోవాల్సి వచ్చిందని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ నేతలు, తత్వవేత్తల గురించి పూర్తిగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఆయన రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ రోజు విశాఖపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తెలుగులో రాసిన ప్రపంచ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. 1978లో తాను, వెంకయ్యనాయుడు శాసనసభ్యులుగా తొలిసారి సభలో ప్రవేశించామని గుర్తుచేసుకున్నారు. ప్రపంచ చరిత్ర పుస్తకంలో ఎన్నో విషయాలు పొందుపరిచారని ముఖ్యమంత్రి వివరిస్తూ...

..వాయిస్... 26 సెకన్లు...

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా పాల్గొన్నారు.

---------------------------

విజయవాడ నగరంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్‌కు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈరోజు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యకలాపాలను విస్తరించే లక్ష్యంతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. 5 అంతస్తులతో నిర్మించనున్న ఈ అధునాతన భవనంలో తలసేమియా కేర్ సెంటర్, రక్త నిధి కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. సేవాభావంతో సమాజానికి అవసరమైన పనులు చేసేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రతిపాదనలు వేగంగా కార్యరూపం దాల్చేలా చూసేందుకు వీలుగా రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్.. ఎస్‌పీఎంజీ పేరుతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైంది. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ లక్ష్యసాధనలో భాగంగా ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్‌ఛైర్మన్‌గా ఎస్‌పీఎంజీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 50 కోట్ల రూపాయలు, అంతకంటే ఎక్కువ విలువైన ప్రాజెక్టుల్ని ఎస్‌పీఎంజీ పర్యవేక్షిస్తుంది. ఆ ప్రాజెక్టుల్ని ఆచరణలోకి తేవడంలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించి, అనుమతులు, వేగంగా వచ్చేలా చూడటం వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది.

---------------------------

తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్న ప్రసాదంలో వడలను నేటి నుంచి అందిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు, అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ నాణ్యమైన దినుసులతో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలను అందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ఇప్పటివరకు 33 లక్షల 67 వేల 791 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శాసనసభలో ఈ రోజు ఆయన సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ.. రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ధైర్యాన్ని, నమ్మకాన్ని కలిగించేలా పనిచేస్తున్నామని మంత్రి మనోహర్ వివరిస్తూ...

..వాయిస్.. 25 సెకన్లు...

---------------------------

ఏలూరు జిల్లా చోదిమెళ్ల వద్ద ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 20 మందికి గాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వారిని పరామర్శించారు. బాధితులకు అందుతున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

---------------------------

వ్యయ ప్రయాసలు లేకుండా సత్వర న్యాయం పొందటానికి జాతీయ లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. అనంతపురం కోర్టులో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు ఎల్లుండి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టులలో బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సివిల్ కేసుల్లో కోర్టుకు చెల్లించిన రుసుము తిరిగి ఇస్తారని శ్రీనివాస్ తెలియజేస్తూ..

.. వాయిస్.. 32 సెకన్లు

=====================